


గురుదేవోభవ

● బోధనే పరమావధిగా సేవలు
● మార్గదర్శకులుగా శాశ్వత కీర్తి
● నేడు ఉపాధ్యాయ దినోత్సవం



పార్వతీపురం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ఎవరైనా జీవితంలో స్థిరపడాలంటే.. ముగ్గురు కారణమవుతున్నారు. వారిలో మొదటి ఇద్దరు తల్లిదండ్రులు అయితే మూడోది గురువులు. అందుకే గురుదేవోభవ అంటారు. మన జీవితంలో అజ్ఞాన చీకట్లను తొలగించి వెలుగుల వైపు నడిపించే వారే ఉపాధ్యాయులు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది.. భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర కీలకం. నేడు టీచర్స్ డే సందర్భంగా జిల్లాలో పాతతరం ఉపాధ్యాయులను పలకరించగా.. తమ విలువైన అనుభవాలను పంచుకున్నారు. నాటి జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. విద్యా వ్యవస్థ, విద్యార్థుల్లో మార్పులపైనా తమ అభిప్రాయాలను తెలిపారు.

టీచర్‌గా పనిచేశా..



ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనది. నేను 1998 నుంచి 2007 వరకు ఎస్జీటీగా తూర్పుగోదావరి జిల్లాలో పనిచేశాను. రోజూ విద్యా బోధనలో ఎంతో ఆనందం కలిగేది. విద్యార్థులను భావి భారత తరాల పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేశా. ఉపాధ్యాయుడిగా రాణించాలంటే.. నిత్య విద్యార్థిగా ఉండాలి. సృజనాత్మకంగా.. ఉత్సాహంగా ఉండాలి. విద్యార్థులు అనంతమైన శక్తిని కలిగి ఉంటారు. ఉపాధ్యాయులు వారి సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలి. కేవలం జీతం గురించి కాకుండా అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ.. విద్యార్థుల ఉన్నతి కోసం పనిచేసే టీచర్ల కోసం ఎంత చెప్పినా తక్కువే. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తృప్తి మరే ఉద్యోగంలో కూడా ఉండదనిపిస్తోంది. నేను ఈ స్థానంలో ఉండడానికి కారణం మా తెలుగు టీచర్ కోటేశ్వరరావు. నా దగ్గర విద్యనభ్యసించిన విద్యార్థుల్లో కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. అప్పుడప్పుడు వారు నాకు ఫోన్ చేస్తుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది.

- ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్

ఆ రోజులే వేరు..



నాడు విద్యలో సాంకేతిక పోకడలు లేకున్నా అభ్యాసనంపై విద్యార్థులు శ్రద్ధ చూపేవారు. ఉపాధ్యాయుడు విద్యార్థులను కొట్టినా... ఇంటి వద్ద ఫిర్యాదు చేసే వారు కాదు. ఒకవేళ చెప్పినా తల్లిదండ్రులు ఉపాధ్యాయులను సమర్థించేవారు. విద్యార్థుల బాగోగుల కోసమే ఉపాధ్యాయులు పనిచేస్తారని చెప్పేవారు. ఉపాధ్యాయులపై విద్యార్థులకు భక్తిభావం ఉండేది. ప్రస్తుత విద్యావిధానంలో ఆదునిక పోకడల వల్ల విద్యార్థుల్లో అభాస్యన ఆసక్తి తగ్గిందన్నారు. స్మార్ట్ ఫోన్లతో కొంతమంది పిల్లలు పక్కదోవ పడుతున్నారు. ఏదేమైనా ఆ రోజులే వేరు.. నేను తొలుత 1968లో శ్రీకాకుళం జిల్లా మద్దివలస సీతారాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలోబయోలాజీకల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. రోజూ వాగు దాటి సీతారాంపురంలో పాఠశాలకు నడిచి వెళ్లేవాడిని. ఆ తర్వాత మొండెంఖల్, చినమేరంగి, పాచిపెంట, శంబర ఉన్నత పాఠశాలల్లో పాఠశాల సహాయకునిగా పనిచేశా. హెచ్‌ఎంగా పదోన్నతిపై గోవిందపురం ఉన్నత పాఠశాలలో పనిచేశా. అక్కడ నుంచి పాచిపెంట ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ చేశా. నా దగ్గర చదివిన వారెందరో వైద్యులు, ఇంజినీర్లు, టీచర్లుగా ఉన్నారు. కొంతమంది విదేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు.

- చంద్రశేఖరుని శ్రీరామమూర్తి (శంబర మాస్టారు), సాలూరు రూరల్

కుటుంబమంతా టీచర్లే..

పార్వతీపురం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఉన్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎం.శ్రీరాములు కుటుంబ సభ్యులంతా టీచర్లే.. 1963లో పార్వతీపురంలో ఆయన హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేశారు. 2000 సంవత్సరం వరకు విద్యాబోధన చేసి.. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఆయన వద్ద చదువుకున్న వారిలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కూడా ఉన్నారు. శ్రీరాములు కొడుకులు, కోడళ్లు, అల్లుడు, కూతురు, అన్నదమ్ముల పిల్లలైన పార్థసారథి, రుక్మిణీదేవి, గోపీనాథ్, మాధవీలత, గోవిందరాజు, బాబూరావు, వెంకటరత్నం, నరసింహమూర్తి కూడా ఉపాధ్యాయులుగా పనిచేస్తుండడం విశేషం. కాగా ప్రస్తుతం ఆయన సామాజిక సేవలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో తృప్తి

ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో తృప్తి ఉంది. విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి విద్యాబోధన చేపట్టేవాళ్లం. అప్పట్లో మాస్టారు అంటే విద్యార్థులకు ఒక గౌరవం ఉండేది. నా కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులుగా ఉండడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఎం.శ్రీరాములు, రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు, పార్వతీపురం



ఉపాధ్యాయులైన కుటుంబ సభ్యులతో రిటైర్డ్ హిందీ టీచర్ శ్రీరాములు

నేడు జిల్లాకేంద్రంలో వేడుకలు

● 72 మందికి అవార్డులు
● ఏర్పాట్లు పూర్తి

పార్వతీపురం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి) / సాలూరు రూరల్ : పార్వతీపురంలోని లయన్స్ కల్యాణ మండపంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పురస్కారాలతో సత్కరించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్, విద్యాశాఖ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది, టీచర్లు పాల్గొనున్నారు. కాగా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో 72 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. హెచ్‌ఎంల కేటగిరిలో పది మంది , పాఠశాల సహాయకుల్లో 20 మంది, ఎస్జీటీల్లో 31 మంది, ఫిజికల్ డైరెక్టర్ కేటగిరిలో 11 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించనున్నట్లు డీఈవో పగడాలమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రిటైర్డ్ అయినా.. విద్యార్థులకు సూచనలిస్తూ..



వీరఘట్టం: ఉత్తమ ఎంఈవోగా, ఉపాధ్యాయుడిగా అవార్డులు పొంది ప్రజలు, విద్యార్థుల మన్నలు పొందారు సత్యానంద మాస్టారు. తొలుత 1976లో జీవశాస్త్రం ఉపాధ్యాయునిగా పెరుమాల పాఠశాలలో పనిచేశారు. 2001 నుంచి 2009 వరకు ఎంఈవోగా వీరఘట్టం, రేగిడి, పాలకొండ మండలాల్లో సేవలందించారు. ఆయన దగ్గర విద్యనభ్యసించిన ఎ.విజయ కుమార్ కర్ణాటక రాష్ట్ర ఐజీగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. మరికొంత మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. 2009లో ఆయన రిటైర్డ్ అయినా నేటికీ విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ.. ముందుకు సాగుతున్నారు.

నాటి విద్యా విధానమే ఉత్తమం



నాకు 1971లో హిందీ పండిట్‌గా ఉద్యోగం వచ్చింది. బాగువలస ,కోడూరు, పాంచాలి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశాను. 2021లో పదవీ విరమణ చేశాను. నా వద్ద మాజీ ఎంపీ డీవీజీ శంకరరావుతో పాటు ఎంతో మంది చదివారు. వారిలో ఇంజనీర్లు, డాక్టర్లు, ప్రభుత్వ కొలువులు సాధించన వారెందరో ఉన్నారు. అయితే అప్పటి విద్యా విధానంతో పోలిస్తే ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయి. అప్పట్లో ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను విద్యార్థులు వినకపోతే బెత్తంతో ఒక్కటి ఇచ్చేవాళ్లం. దీంతో వారు క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి మంచి మార్కులు పొందేవారు. అయితే నేటి విద్యా విధానంలో ఆ పరిస్థితి లేదు. విద్యార్థిని దండించే రోజులు పోయాయి. ఏదేమైనా నాటి విధానమే ఉత్తమం. ఇదిలా ఉండగా ఉపాధ్యాయుల పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా నిబంధనలను తీసుకురావాలి. అప్పుడే విద్యా వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది.

- బండి మరియ దాస్, రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు, సాలూరు

అమ్మో.. బందలు

● వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయంటున్న గ్రామస్థులు
● దోమలకు ఆవాసంగా మారుతున్నాయని అధికారులకు ఫిర్యాదు ● వెంటనే పూడ్చాలని వేడుకోలు

జియ్యమ్మవలస: జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బందలు వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి. వాటిల్లో చేరే మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోగా, చుట్టూ చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోవడంతో అవి దోమలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతవాసులు తరచూ రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడుతున్నారు. జియ్యమ్మవలస నియోజకవర్గంలో సుమారు 150 వరకూ బందలు ఉండగా.. చినమేరంగిలో పరిస్థితిని పరిశీలిస్తే.. ఈ గ్రామంలో దళితవాడకు ఆనుకుని ఉన్న దాలమ్మ బందలో గత మూడేళ్లుగా నీరు నిల్వ ఉంది. దీంతో నిత్యం దుర్వాసన వెలువడుతుండగా.. స్థానికులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. మరోవైపు ఖాళీ కొబ్బరి బోండాలు, బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు, మురుగు నీరు, మల మూత్రాదులు దానిలోనే కలుస్తున్నాయి. దీనిని పట్టించుకునే వారే కరువవడంతో ఇది దోమలు ఆవాసంగా మారింది. ఇప్పటికే చినమేరంగి దళితవాడ వాసులు మలేరియా, విష జ్వరాలతో ఆసుపత్రులకు క్యూకట్టారు. ఇదే మండలంలో నిర్వాసిత గ్రామం బట్లభద్రలో మేరువవాని బంద పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇది విష సర్పాలు, దోమలకు నిలయంగా మారింది. మూడేళ్ల కిందట అల్లు మంగమ్మ అనే మహిళ పాము కాటుకు గురై మృతి చెందింది. అల్లు వెంకటరమణతో పాటు మరో ముగ్గురు ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఏడాదిలో ఆ గ్రామస్థులు ఎంతోమంది జ్వరాలతో మంచం పట్టారు. జ్వర లక్షణాలతో బాధపడి దుర్గమ్మ, చైతన్య, వెంకటరమణ మృత్యువాత పడ్డారు. దీంతో వ్యాధులకు కారణమవుతున్న బందలను తక్షణమే పూడ్చా లని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలను సందర్శించిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయ పార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు, కురు పాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. 'బందల విషయాన్ని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుం టాం.' అని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు తెలిపారు.


చినమేరంగిలో దాలెమ్మ బంద

ఆశ్రమ పాఠశాల నిర్వహణపై ఇన్‌చార్జి పీవో ఆగ్రహం

● డిప్యూటీ వార్డెన్‌కు మెమో

సీతంపేట: సీతంపేట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వీవీ రమణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు పరిశుభ్రంగా లేకపోవడాన్ని గుర్తించారు. విద్యార్థుల కోసం వండిన భోజనం రుచికరంగా లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీతంపేట ఏటీడబ్ల్యూవో మంగవేణిని ప్రశ్నించారు. డిప్యూటీ వార్డెన్ రామ్మోహన్ మెమో జారీ చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొరను ఆదేశించారు. పప్పు, పెరుగు పలుచగా ఉండడం, విద్యార్థులకు సరిపడా భోజనం వండకపోవడం, భోజన శాల పరిశుభ్రంగా లేకపోవడం వంటివి పీవో పరిశీలనలో గుర్తించినట్లు తెలిసింది. కాగా ఈ తనిఖీల్లో ఏపీవో చిన్నబాబు, ఇతర శాఖల అధికారులు తదితరులున్నారు.


ఆశ్రమ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

గిరిజనుల జీవనోపాధికి చర్యలు: కలెక్టర్

పార్వతీపురం రూరల్: జిల్లాలో గిరిజనుల జీవనోపాధికి చర్యలు తీసుకోవలని, లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. వన్‌దన్ వికాస్ కేంద్రాల కార్యకలాపాలు పెంచాలన్నారు. జిల్లాలో లభ్యమవుతున్న అన్ని పంటలను వాటి ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. వీడీవీకేలతో పాడి పశువుల నిర్వహణ, దర్జీ పని, సివిల్ కాంట్రాక్ట్ పనులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ వంటివి చేపట్టొచ్చని తెలిపారు. నాబార్డు అభివృద్ధి అధికారి దినేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు వేల మందికి జీవనోపాధి కల్పించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమీక్షలో డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు వై.సత్యంనాయుడు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి ఈ-పంట నమోదు పూర్తి కావాలి

ఈ నెల 15 నాటికి జిల్లాలో ఈ-పంట నమోదు పూర్తి కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. వ్యవసాయాధికారులు స్వయంగా పంటను పరిశీలించాలన్నారు. లోపాలు ఉంటే సహించేది లేదన్నారు. భూసార పరీక్షా కార్డులు జారీ చేయాలని, అందులో సూచించిన మేరకు ఎరువులు వినియోగించేలా చూడాలని సూచించారు. ఉద్యానశాఖ కింద జీడిమామిడి పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టులన్నారు. ఆదాయాన్ని తెచ్చే పంటలను ప్రోత్సహించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, డీఎఫ్‌వో ప్రసూన, పశు సంవర్ధకశాఖాధికారి మన్మథరావు, మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య పాల్గొన్నారు.

రక్తహీనత నివారణే లక్ష్యం

వీరఘట్టం: మనబడి-మన తోట కార్యక్రమంలో భాగంగా వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బుధవారం మొక్కలను నాటారు. జిల్లాలోని అన్ని పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పౌష్టికాహార పంటలపై పిల్లలకు తెలియజేయాలన్నారు. గర్భిణుల నమోదులో జాప్యం చేయరాదన్నారు. రక్తహీనత నివారణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వీరఘట్టంలో ఉన్న వర్మీకంపోస్టు యూనిట్‌ను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారు కేం ద్రం పనితీరు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 138 యూనిట్లు ఉన్నాయని, అక్టోబరు 2 నుంచి పూర్తిస్థాయిలో చెత్త నుంచి సంపద తయారు చేసి కేంద్రాలను అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. వీరఘట్టం లోని స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్టును సందర్శించారు. అకౌంటింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. డీఈవో పగడాలమ్మ, జిల్లా ప్రో గ్రాం అధికారి వినోద్, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

9న పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ గ్రూప్, అమెజాన్ సంస్థల్లో 200 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంగ్లిష్ చదవగలిగే వారు, టెన్త్ ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులన్నారు. అభ్యర్థుల వయసు 30 సంవత్సరాల లోపు ఉండాలని వెల్లడించారు. వేతనం రూ.16 వేల నుంచి రూ.18 వేలు ఉంటుందని, చెన్నై కేంద్రంగా పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం ఈ 89788 78557, 94947 77553 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఏనుగుల హల్‌చల్

కొమరాడ / జియ్యమ్మవలస, సెప్టెంబరు 4 : కొమరాడ మండలం పాత కళ్లికోట - దుగ్గి గ్రామాల మధ్య గజరాజులు హల్‌చల్ చేశాయి. బుధవారం మధ్యాహ్నం అవి ముంపు ప్రాంతంలో సంచరించాయి. దీంతో ఆయా గ్రామస్థులు తీవ్ర భయాందోళన చెందారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు సాహసించడం లేదు. ఆస్తి, పంట నష్టాలు సంభవించకముందే సంబంధిత అధికారులు స్పందించాలని, వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఆయా ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.


పాత కళ్లికోట - దుగ్గి గ్రామాల మధ్య సంచరిస్తున్న ఏనుగులు

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం నరకం

● గుమడ వద్ద అంతర్రాష్ట రహదారిపై గోతిలో దిగిబడిన లారీ ● సుమారు గంటన్నర పాటు స్తంభించిన ట్రాఫిక్
● ప్రయాణికులు, వాహన చోదకులకు తప్పని ఇబ్బందులు ● 10న కూనేరు వద్ద బంద్‌కు సిద్ధమవుతున్న లారీ డ్రైవర్లు

కొమరాడ / జియ్యమ్మ వలస, సెప్టెంబరు 4 : కొమరాడ మండలం గుమడ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై గోతిలో బుధవారం ఓ లారీ దిగబడింది. పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ్తున్న 22 చక్రాల భారీ వాహనం అక్కడున్న బురదలో కూరుకుపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఉదయం 9:30 గంటల నుంచి 11 గంటల వరకు భారీగా ట్రాఫిక్ స్తంభించిం చింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులుదీరాయి. ముందుకు వెళ్లలేక.. వెనక్కి రాలేక ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. చివరకు కొమరాడ పోలీసులు, స్థానిక లారీ కార్మికులు ఎక్స్‌కవేటర్ సాయంతో ఆ లారీని పక్కకు తొలగించారు. దీంతో యథావిధిగా వాహన రాకపోకలు సాగడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. వాస్తవంగా ఆంధ్రా, ఒడిశా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు కీలకమైన ఈ రహదారిపై గత వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. కనీసం మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయలేదు. దీంతో అడు గడుగునా భారీ గోతులతో నిండిన ఈ దారిపై తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు వాహనాలు గోతిలో దిగబడుతుం డడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో రహదారి మరమ్మతులు చేయక పోతే ఈ నెల 10న ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామం కూనేరు వద్ద లారీ డ్రైవర్లతో బంద్ నిర్వహిస్తామని జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యులు కొల్లి సాంబమూర్తి హెచ్చరించారు.


నిలిచిపోయిన వాహనాలు



గుమడ వద్ద అంతర్రాష్ట్ర రోడ్డుపై గోతిలో దిగబడిన లారీ

సమంతకు గాయం



టాలీవుడ్ కథానాయిక సమంత గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆమె బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఎప్పుడు, ఎలా గాయపడ్డారు అనే వివరాలను ఆమె వెల్లడించలేదు. మోకాలి గాయానికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్స తీసుకుంటున్నారు సమంత. తన శరీరంలో రెండు సూదులు గుచ్చి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేసి, 'గాయాల బారిన పడకుండా యాక్షన్ స్టార్‌ను అవ్వగలనా?' అని సరదాగా స్పందించారు. దీంతో సమంత లీడ్‌రోల్‌లో నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారని భావిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల నిషేధం

నడిగర్ సంఘం మహిళా భద్రతా కమిటీలో తీర్మానం




నటీమణులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు రుజువైతే చిత్రపరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నడిగర్ సంఘం నిషేధం విధించనుంది. ఈ మేరకు నడిగర్ సంఘం అనుబంధ విభాగమైన మహిళా భద్రతా కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ కమిటీ సమావేశం బుధవారం నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తీ, కమిటీ అధ్యక్షురాలు రోహిణి సారథ్యంలో కమిటీ సభ్యులు సుహాసిని, ఖుష్బూ, లలిత కుమారి, కోవై సరళ తదితరులు పాల్గొన్నారు. ఇందులో కొన్ని తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ జరిపి నిజమని తేలితే చిత్ర పరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నిషేధం విధించేలా తీర్మానం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, న్యాయ సలహాలు ఇప్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని తొలుత హెచ్చరించి, ఆ తర్వాత చర్యలకు ఉపక్రమిస్తారు. కమిటీకి ఫిర్యాదు చేసే బాధితులు మీడియాతో ప్రత్యక్షంగా మాట్లాడకూడదు. యూట్యూబ్‌లో సినీ నటులను కించపరిచేలా మాట్లాడేవారిపై బాధితులు సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి కమిటీ అన్ని విధాలా సహకరిస్తుంది.


- చెన్నై (ఆంధ్రజ్యోతి)

మేమున్నామని.. మీకేం కాదని..

వరద బాధితులకు సినీ ప్రముఖుల సాయం









వరదలతో ఇబ్బంది పడుతున్న తెలుగు ప్రజానీకాన్ని ఆదుకునేందుకు కొంతమంది సినీ ప్రముఖులు ఇప్పటికే తమవంతు సాయాన్ని అందించగా బుధవారం మరికొందరు విరాళాలను ప్రకటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చిరంజీవి రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ. 50 లక్షలు ఇస్తున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'వరద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు నన్ను కలిచివేశాయి. పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందరూ తమకు తోచినట్లు సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి. ఈ విపత్కర పరిస్థితులు త్వరలోనే తొలగిపోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. చిరు తనయుడు రామ్‌చరణ్ సైతం రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. తెలుగు ప్రజలకు అందరూ అండగా ఉండాల్సిన సమయమిదని రామ్‌చరణ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వరద బారిన పడిన 400 పంచాయతీలకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. నాలుగు కోట్ల సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ తన వంతుగా రూ. రెండు కోట్ల విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. కోటి చొప్పున అందజేయనున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. అల్లు అర్జున్ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ విపత్కర పరిస్థితులు తొలగిపోయి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వరద బాధితులను ఆదుకునేందుకు అక్కినేని కుటుంబం, గ్రూపు సంస్థలు రెండు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించాయి. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 25 లక్షల సాయాన్ని ప్రకటించిన వైజయంతీ మూవీస్ సంస్థ తాజాగా తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 20 లక్షల విరాళాన్ని ప్రకటించింది. నిర్మాత అశ్వనీదత్ బుధవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్ అందజేశారు. హీరో సాయిదుర్గ తేజ్ ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. 20 లక్షలు, విజయవాడలోని అమ్మ ఆశ్రమానికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించారు. అలీ, జుబేదా దంపతులు ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. ఆరు లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ - రూ. 2 కోట్లు (ఏపీలోని గ్రామ పంచాయితీలకు రూ. 4 కోట్లు)
ప్రభాస్ - రూ. 2 కోట్లు
చిరంజీవి - రూ. కోటి
రామ్‌చరణ్ - రూ.కోటి
అల్లు అర్జున్ - రూ. కోటి
అక్కినేని కుటుంబం, గ్రూప్ సంస్థలు కలిపి - రూ. కోటి
సాయిదుర్గ తేజ్ -రూ.20 లక్షలు
వైజయంతీ మూవీస్ - రూ. 20 లక్షలు (తెలంగాణకు)
అలీ, జుబేదా దంపతులు - రూ. 6 లక్షలు



కొరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర 1' చిత్రం నుంచి మాస్ నంబర్‌ను విడుదల చేశారు. 'కొరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా' అంటూ రామజోగయ్యశాస్త్రి రాసిన పాట వీడియోను విడుదల చేశారు. ఈ పాటలో ఎన్టీఆర్ వేసిన స్టెప్పులు ఆడియన్స్‌తో డాన్స్ చేయించేలా ఉన్నాయి. ఎన్టీఆర్ డాన్స్ ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారో దాన్ని మించేలా శేఖర్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. జాన్వీకపూర్ గ్లామరెస్‌గా కనిపించారు. ఎన్టీఆర్‌తో పోటీగా స్టెప్స్ వేశారు. 'దేవర' మీద ఇప్పటివరకూ ఉన్న అంచనాలు ఈ పాటతో నెక్స్ట్ లెవల్‌కు చేరాయి. అనిరుధ్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. హై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'దేవర' రెండు భాగాలుగా ప్రేక్షకులను అలరించనుంది. మొదటి భాగాన్ని ఈ నెల 27న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ నిర్మిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

విడుదల వాయిదా



'ఈ నెల ఏడున 'జనక అయితే గనక' సినిమాను విడుదల చేయాలనుకున్నాం.అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితుల కారణంగా విడుదల వాయిదా వేస్తున్నాం. నవ్వుల వినోదం పండించే రోజుని త్వరలో ప్రకటిస్తాం. ప్రేక్షకులు అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన సినిమా కనుక ఈ నిర్ణయం తీసుకున్నాం' అని వెల్లడించారు దిల్ రాజు. సుహాస్ హీరోగా రూపుదిద్దుకున్న 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'మూవీ ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా బాగా నచ్చింది. అందుకే యుఎస్‌ఏ హక్కులు కొన్నాను. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ యువకుడిగా నటించా. దిల్ రాజుగారు ఎంతో సపోర్ట్ చేశారు' అన్నారు.

పిల్లలతో చూడాల్సిన సినిమా



ప్రియదర్శి, విశ్వదేవ్, నివేద థామస్, గౌతమి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నందకిషోర్ ఈమాని దర్శకత్వంలో రానాదగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'ఇది పిల్లలతో కలసి చూడాల్సిన సినిమా. దర్శకుడు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా తెరకెక్కించార'ని ప్రశంసించారు.

మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది



వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు మీనాక్షీ చౌదరి. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ సరసన ఆమె నటించిన 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీనాక్షీ మీడియాతో పంచుకున్నారు.

"ఈ సినిమాలో నాది చాలా మంచి పాత్ర. ఆ పాత్ర నన్ను నేను రిలేట్ చేసుకునేలా ఉంటుంది. దర్శకుడు వెంకట్ ప్రభు ఈ సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు. ఈ మూవీ షూటింగ్ సమయంలో విజయ్, స్నేహ, లైలా వంటి అనుభవజ్ఞులైన నటుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమా అందరికీ మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది. విజయ్ యాక్టింగ్, వెంకట్ ప్రభు డైరెక్షన్ స్కిల్స్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి" అని చెప్పారు.

ఫిష్ వెంకట్‌కు సాయం



విలన్ పాత్రల్లోనూ తనదైన శైలిలో కామెడీని పండిస్తూ తెలుగు ప్రేక్షకులను నవ్వించిన ఫిష్ వెంకట్ రెండు కిడ్నీలు పాడై దయనీయ స్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఖర్చు పెట్టే స్తోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సినిమాల్లో నటించమని పిలుపు వస్తున్నా ఒంట్లో సత్తువ లేక కొన్నేళ్ల నుంచి ఇంటికే పరిమితమైనట్లు చెప్పారు. ఖర్చులకు చేతిలో పైసా లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలను అందజేశారు. ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, కె.అజయ్‌కుమార్, అనిల్ ఈ చెక్కును ఫిష్ వెంకట్‌కు అందజేశారు.



జేఎన్‌టీయూకేలో ఎంటెక్ స్పాన్సర్డ్ కోటా



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కనీసం ఏడాది అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- ★ సివిల్ ఇంజనీరింగ్ - స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- ★ మెకానికల్ ఇంజనీరింగ్ - క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ - కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- ★ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ
- ★ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ - రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- ★ బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఏఐఎంఈ లేదా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్/బయోటెక్నాలజీ/ఎర్త్‌సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/జియాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్ ఉండాలి.

- ★ **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- ★ **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cHqjyDZలో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** www.iift.ac.in




నిలువెత్తు నిర్లక్ష్యం

- కొత్తపేటలోని పాత నీళ్లట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

(విజయనగరం రూరల్)

అశోక్ గజపతిరాజు మేనత్త మహారాణి అప్పలకొండమాంబ విజయనగరం ప్రజల దాహార్తిని తీర్చేందుకు 1913లో పాత మహారాజు పేట (ప్రస్తుతం కొత్తపేట)లో నీళ్లట్యాంకును నిర్మించారు. ఆ నీళ్లట్యాంకు దాదాపు శతాబ్దం పాటు నగర ప్రజల దాహార్తిని తీర్చింది. ఇప్పటికే ఆ పాత ట్యాంకు వినియోగంలోనే ఉంది. కొత్తవెన్ని కట్టినా పాత ట్యాంకుకు ఉన్న పటిష్టత, సామర్థ్యం కొత్త ట్యాంకుల్లో సందేహమే. అటువంటి కట్టడం నేడు నిర్లక్ష్యానికి గురవుతోంది. నీటి నాణ్యత, ట్యాంకులోపల శుభ్రత పాటిస్తున్న అధికారులు ట్యాంకు బయట నిర్మాణం, ఆవరణను విస్మరిస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తిగా పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తూ, శిథిలావస్థను తలపిస్తోంది. ఈ ట్యాంకు కట్టడం ఎంతో అద్భుతం. అటువంటి నిర్మాణం నిర్లక్ష్యానికి గురి కావడం పట్ల నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిండా పిచ్చిమొక్కలు బలిసిపోతున్నా, చెదలు పడుతున్నా అటువైపు అధికారులు చూడడం లేదన్నది ప్రజల భావన. ఈ ట్యాంకుకు చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను శుభ్రం చేసి.. ఆ ట్యాంకును పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.



మహారాణి అప్పలకొండమాంబ నిర్మించిన ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు, అపరిశుభ్ర వాతావరణం ఇలా..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కనకరాజు (ఫైల్)

భోగాపురం: మండలం భోగాపురం పెట్రోల్ బంకు సమీపంలో జాతీయరహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నందిగాంకు చెందిన గరె కనకరాజు(39), గూడెపువలసకు చెందిన రామకాసు ఇద్దరూ భోగాపురంలో దస్తావేజులేఖర్ల వద్ద పని చేస్తున్నారు. ఎప్పటిలాగే విధులు ముగించుకుని బుధవారం రాత్రి బైక్‌పై కనకరాజు, రామకాసు ఇద్దరూ ఇంటికి బయలుదేరారు. జాతీయ రహదారిపై భోగాపురం నుంచి నాతవలస వైపు వస్తుండగా భోగాపురం పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొంది. ద్విచక్రవాహనంతో పాటు ఇద్దరూ కొంత దూరంలో రోడ్డుపై తుళ్లిపడ్డారు. దీంతో ఇద్దరికీ బలమైన గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే మొబైల్ వాహనం క్షతగాత్రులిద్దరినీ చికిత్స నిమిత్తం విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించగా కనకరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయాలపాలైన రామకాసు చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు లారీని ఛేదించి లారీని, డ్రైవర్‌ను పట్టుకొన్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు సమాచారం. మృతుడికి భార్య అఖిలేశ్వరి, ఇద్దరు చిన్న పిల్లలు, తల్లి అమ్మన్న, తమ్ముడు ఉన్నారు. కనకరాజు మృతితో నందిగాం గ్రామం విషాదంలో మునిగిపోయింది.

సీతానగరంలో వ్యక్తి..

సీతానగరం: మండలంలోని గుచ్చిమి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం చిలకాం గ్రామానికి చెందిన రేగిడి రాజు(43) మంగళవారం సాయంత్రం రామభద్రపురం ఆరికతోటలో తన బంధువుల ఇంటికి వెళ్తానని తన భార్యతో చెప్పి వెళ్లాడు. తిరిగి వస్తుండగా అదే రోజు రాత్రి గుచ్చిమి సమీపంలో ద్విచక్ర వాహనంతో గాయాలపాలై పడి ఉన్న రాజును స్థానికులు గుర్తించారు. 108 వాహనం ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. తనంతట తాను పడిపోయాడా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా.. తెలియరావాల్సి ఉంది. మృతుడు భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

యాసిడ్ తాగి వృద్ధురాలి మృతి

బొబ్బిలి, సెప్టెంబరు 4: మండలంలోని కారాడ గ్రామానికి చెందిన కూర్మదాసు రమణమ్మ(60) పొరపాటున టాయ్‌లెట్ క్లీనింగ్ యాసిడ్ తాగి మృతి చెందింది. స్థానిక సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రమణమ్మ తమ ఇంట్లో ఫ్రిజ్ పక్కన గల యాసిడ్ సీసాను మంచినీళ్ల సీసాగా భావించి దానిని మంగళవారం సేవించిందని, దీనితో ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైందన్నారు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటీన బొబ్బిలి సీహెచ్‌సీలో చేర్పించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనమేరకు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమణమ్మ మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కన్నుమూసింది. మృతురాలి కుమారుడు అప్పలసూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో 9మందికి గాయాలు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం పిచ్చికుక్క దాడిలో 9మంది వ్యక్తులతో పాటు రెండు పశువులు, రెండు గొర్రెలు గాయపడ్డాయి. దీనికి సంబంధించి స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం ఒక పిచ్చికుక్క గ్రామంలోకి వచ్చిందని, వీధిలో ఉన్న మహిళలపై దాడి చేసి కరిచిందని, అనంతరం పశువులను, గొర్రెలను గాయపరిచిందన్నారు. గాయపడ్డ రామలక్ష్మి, సుందరమ్మ, పార్వతి, కొటరావు, సత్యవతి, సన్యాసమ్మ, యశ్వంత్‌కుమర్, బంగారమ్మ తదితరులు ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రి, కొట్టాం పీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అనంతరం వ్యాక్సిన్ వేయించుకున్నారు.

అక్రమ ఇసుక నిల్వలు స్వాధీనం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని కొట్టాం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసి ఇసుకను వీఆర్‌వో కన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం సీజ్‌చేశారు. గ్రామంలో ఇసుక అక్రమరవాణా జరుగుతుందని కొద్దిరోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో వార్తలు ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ ఇసుకను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి రవాణా చేస్తూ అరెస్టు

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు బుధవారం తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఆర్‌పీ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కుప్పంనకు చెందిన సి.బాలసుబ్రహ్మణ్యం ఒడిసా కంటబంజి నుంచి చిత్తూరుకు అక్రమంగా గంజాయి బదిలీ చేస్తూ పట్టుబడ్డాడని, అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ బాలాజీరావు తెలిపారు.

సామూహిక సీమంతాలు

బాడంగి: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని రామచంద్రాపురం సామూహిక సీమంతాలు నిర్వహించారు. రామచంద్రాపురం సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు, వేసుకోవాల్సిన మందులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీవో, సూపర్‌లు నాగమణి, గౌరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ప్రవాహం తగ్గాకే వాహనాలకు అనుమతి

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో వేగావతి నదీ ప్రవాహం ఇంకా తగ్గలేదు. బుధవారం పారాది కాజ్‌-వే వాహనాలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ జామ్ అయింది. నీరు తగ్గాకే భారీ వాహనాలకు అనుమతిస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నదిలో కూడా మత్స్యకారులు కాజ్ - వేపై చేపలు పడుతున్నారు.

విద్యార్థుల ఒత్తిడికి తలొగ్గిన కరస్పాండెంట్

- పాఠశాల రెన్యువల్ ఫారాలపై సంతకాలు

బొబ్బిలి: చారిత్రాత్మకమైన సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల కథ మరో మలుపు తిరిగింది. ఇటీవల ఈ పాఠశాల రిజిస్ట్రేషన్ గడువు పూర్తయిన కారణంగా పాఠశాలను ఖాళీ చేయాలని, విద్యార్థులంతా వేరే స్కూలుకు వెళ్లిపోవాలని డిప్యూటీ డీఈవో మోహనరావు లిఖితపూర్వకంగా తెలియజేశారు. దీనిపై సీబీఎం విశ్వాసకుల సంఘం, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులంతా నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని డిప్యూటీ డీఈవో ప్రభుత్వానికి నివేదించారు. బుధవారం పాఠశాల కరస్పాండెంట్ రత్నకుమార్ ఇక్కడికి విచ్చేశారు. మరోసారి వీరంతా నిరసన తెలిపారు. విద్యార్థులంతా తమ గోడును కరస్పాండెంట్‌కు వెళ్లబుచ్చారు. పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని, హెచ్‌ఎం సునేత్రిని బదిలీ చేయవద్దని డిమాండ్ చేశారు. ఆయన కార్యాలయం ముందు బైఠాయించారు. సంఘం ప్రతినిధులు అదృష్టకుమార్, గొంటి వేణు, విజయ్‌తో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్ తదితరులు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ నినాదాలు చేశారు. దీనిపై కరస్పాండెంట్ దిగివచ్చారు. పాఠశాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ పత్రాలపై సంతకాలు చేశారు. హెచ్‌ఎంను ఇక్కడే కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

ఆసుపత్రిని అభివృద్ధి చేస్తా: బేబీనాయన



పశు ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తెర్లాం: పాడి పశువుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బుధవారం ఆయన మండలంలో నెమలాం పశు ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆ సుపత్రి మొత్తం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పశుఆసుపత్రి పూర్తిగా పాడైపోయిందని, అక్కడక్కడా పెచ్చులు కూడా ఊడిపోయాయని, వర్షం వస్తే కారిపోయిందని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు. వెంటనే అక్కడినుంచి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. కొత్త హాస్పిటల్ నిర్మాణానికి అంచనా వేసి నివేదిక పంపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంతరం వి.అప్పలనాయుడు మాష్టారు రిటైర్‌మెంట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉద్దవోలు ఎంపిటీసీ మరడాన చిన్నమ్మలును పరామర్శించారు. నరేంద్రకుమార్, నర్సుపల్లి వెంకట నాయుడు, వెంకటేశ్వరరావు, కరణం రమేష్, ఉపాధ్యయులు, నాయకులు పాల్గొన్నారు.

సేవచేయడం చాలా గొప్ప విషయం

- విజయనగరం ఎంపీ కలిశెట్టి



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

కొత్తవలస: సేవలు చేయడం సామాన్యమైన విషయం కాదని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఐదు రాష్ట్రాల్లో లక్షలాది మంది దివ్యాంగులకు ఎన్నో రకాల సేవలు అందిస్తున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆయన కొనియాడారు. బుధవారం మండలంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టును శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారితో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ఛైర్మన్ ఎంతో సంకల్పంతో సేవలందిస్తున్నారని, కార్పోరేట్ స్థాయిలో గురుదేవా ఆసుపత్రిని ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని, క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగుల కోసం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం చేయడాన్ని ఆయన ప్రశంసించారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ దివ్యాంగులు ఎవరూ అధైర్య పడవద్దని, ఆదుకునేందుకు ప్రభుత్వం ఉందని, సేవలు అందించడానికి గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఉందన్నారు. ఈసందర్భంగా ఎంపీ కలసి దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించారు. ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబును ఘనంగా సన్మానించారు. లీడర్ ఆఫ్ బనారస్ హిందూ యూనివర్శిటీ స్టూడెంట్స్ రాకేష్, డీఎంహెచ్‌వో భాస్కరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు గొరపల్లి రాము, నాయకులు జీఎస్ నాయుడు, కనకాల శివ, నక్కరాజు చినరాము తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల నగదు ప్రభుత్వానికి చెల్లించాలి



మాట్లాడుతున్న జేడీ రామారావు

శృంగవరపుకోట: ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన నగదును ప్రభుత్వానికి సకాలంలో చెల్లించకుంటే క్రిమినల్ చర్యలు ఉంటాయని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ సంచాలకులు వీటీ రామారావు గ్రామ సచివాలయ వ్యవసాయ కార్యదర్శులను హెచ్చరించారు. బుధవారం శృంగవరపుకోట వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఉన్న రైతు భరోసా కేంద్రంలో డివిజన్ స్థాయి వ్యవసాయ శాఖ శిక్షణ తరగతులను నిర్వహించారు. సచివాలయ కార్యదర్శులు ఎరువుల క్రయ, విక్రయాల వివరాలను వ్యవసాయ శాఖ కార్యాలయానికి సక్రమంగా పంపించకపోవడంతో ప్రభుత్వం నుంచి జిల్లా రైతాంగానికి సరిపడా స్టాక్ రావడం లేదన్నారు. ఇ-పంట నమోదులో తేడా కారణంగా ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు నష్టం జరిగితే చర్యలు తప్పవన్నారు. ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు, ఏడీఏలు భారతి, విజయ, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

యాత్ర మాస్టారు..

బొబ్బిలి/ రూరల్: బొబ్బిలి మండలం ఎం.బూర్జివలస గ్రామానికి చెందిన బుదిరెడ్డి సూర్యనారాయణ(86) ఈయన 1960లో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. చోళ్లపథం, నరసాపురం, ఎం.బూర్జివలసలో పనిచేసి 1999లో హెచ్‌ఎంగా రిటైరయ్యారు. నాటి నుంచి నేటి వరకు సంపూర్ణ భారత దేశయాత్ర పేరుతో అందరినీ పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్లడం హాబీగా పెట్టుకున్నా రు. ఇంతవరకు 50కి పైగా యాత్రలు నిర్వహించారు. ఈయనను అందరూ యాత్ర మాస్టారుగా పిలుస్తారు. ఆయన మాట్లాడుతూ అప్పట్లో 35 మార్కులు వచ్చే విద్యార్థుల్లో కూడా బాగా తెలివి, బుద్ధి ఉండేవి. ఇప్పుడు బట్టీ పట్టే పద్ధతి రావడంతో నూటికి నూరు మార్కులు వచ్చినా మేథస్సు మిథ్యగా మారిపోయిందన్నారు.

సాష్టాంగ నమస్కారాలు చేసేవారు

అప్పట్లో విద్యార్థులు ఉపాధ్యాయులకు సాష్టాంగ నమస్కారాలు చేస్తుండేవారు. 1969లో ఉద్యోగంలో చేరి పది పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేశాను. ఉపాధ్యాయుల జీతాలు, జీవితాల్లో మార్పులు వచ్చినట్టే విద్యావ్యవస్థలో కూడా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు ఆరోగ్యకరంగా లేవు. నాటి విలువలతో కూడిన విద్య మళ్లీ వస్తేనే సమాజంలో నైతికత పెరుగుతుంది.

- జామి సూరిదాసు (80), రిటైర్డ్ ఉపాధ్యాయుడు, పిరిడి

ఉపాధ్యాయుడిగా ఉత్తమ సమాజాన్ని నిర్మించవచ్చు

బొబ్బిలి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీను ఎన్నో అనుభవాలను వివరించారు. ఆయన 1995 నుంచి పదేళ్ల పాటు చీపురుపల్లి మండలం పత్తికాయవలస, రావివలస, బొండపల్లి మండలం వేంద్రం గ్రామాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఆ తర్వాత గ్రూపు-2 పరీక్షల్లో అర్హత సాధించి బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో 2007 వరకు ఈవోపీఆర్డీగా పనిచేశారు. 2007లో గ్రూపు-1 పరీక్షలు రాసి ఎంపీడీవోగా 15 సంవత్సరాలు పనిచేశారు. 2018లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 1999 నాటి గ్రూపు-2 పరీక్షలలో ఉత్తీర్ణత మేరకు డిప్యూటీ తహసీల్దార్‌గా చేరారు. ఆ తర్వాత గార తహసీల్దార్‌గా పనిచేసి బొబ్బిలికి బదిలీపై వచ్చారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి తహసీల్దార్‌గా వచ్చిన శ్రీను తన అనుభవాలను ఇలా వివరించారు.

'ఉపాధ్యాయ వృత్తి ద్వారా సమాజ నిర్మాణం జరుగుతుంది. మంచి పౌరులను తీర్చిదిద్దే బృహత్తరమైన బాధ్యతను నిర్వరిస్తాం. ఆ వృత్తిలో ఓ ప్రత్యేకమైన తృప్తి ఉంటుంది. అధికార హోదాలో సమాజంలోని పౌరులకు పలురకాలుగా సేవ చేసే అవకాశం లభిస్తుంది. అధికార హోదాలో లభించే గౌరవ ప్రపత్తులు వేరు. పాఠశాలల్లో చిన్నారుల ఆదరాభిమానాలు, వారి తల్లిదండ్రులు చూపే కృతజ్ఞతా భావం వేరు. దానిని వెలకట్టలేము' అని తెలిపారు.

కష్టకాలంలోనూ రాజకీయమేనా?: కళా



మాట్లాడుతున్న కళా వెంకటరావు

రాజాం/రూరల్, సెప్టెంబరు 4: ప్రకృతి వైపరీత్యంతో ఓవైపు వందలాది మంది ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోదిస్తుంటే.. మరోవైపు అధికార యంత్రాంగంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాత్రనకా, పగలనకా సహాయక చర్యల్లో పాల్గొంటుంటే.. కష్టకాలంలో పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు రాజకీయం చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఆక్షేపించారు. రాజాంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగన్ రెడ్డి అయిదేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు. రాష్ట్రాన్ని, వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. అమరావతి ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ కూడా చేయించలేదని, ఇప్పుడు రాజధాని మునిగిపోయిందని వైసీపీ శ్రేణులు చేస్తున్నది విషప్రచారమని కొట్టిపారేశారు. అయిదేళ్ల జగన్‌పాలనతో విసిగిపోయిన ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడంపై సిగ్గుపడాలని జగన్‌రెడ్డికి కళావెంకటరావు సూచించారు.

ధ్వజ స్తంభం మాను ఊరేగింపు



ఎస్.కోటలో ఊరేగిస్తున్న వేంకటేశ్వర ఆలయ ధ్వజస్తంభ మాను

శృంగవరపుకోట: శృంగవరపుకోట పుణ్యగిరి వద్ద నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయ ధ్వజ స్తంభం చెట్టను బుధవారం పురవీధుల్లో ఊరేగించారు. ఆలయకమిటీ ఛైర్మన్ ఇందుకూరి రఘురాజు, మోపాడ గౌరినాయుడు, ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్దకు చేర్చిన ధ్వజస్తంభం చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నాళ్లు మభ్యపెడతారు?



ఏఈ తో మాట్లాడుతున్న గ్రామస్థులు

జామి: మండలంలోని లోట్లపల్లి గ్రామంలో మంచినీటి సమస్య తీర్చాలని నెలల తరబడి కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, గ్రామస్థుల ఇంకా ఎన్నాళ్లు ఇబ్బందులు పడాలని గ్రామస్థులు బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఝాన్సీని ప్రశ్నించారు. గ్రామానికి వచ్చిన ఏఈని గ్రామ సచివాలయం వద్ద గ్రామానికి చెందిన జన్నెల బాలకృష్ణ తదితరులు ఆమెతో మాట్లాడారు. రెండునెలల క్రితం మంత్రి వచ్చినప్పుడు సమస్య తీరుస్తామన్నారని, నెలలు దాటుతున్న ఆ ఊసే మరిచిపోయారన్నారు. దీనిపై ఏఈ మాట్లాడుతూ నీటిసరఫరా సమస్యను వారంరోజుల వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. మరో వారంరోజుల్లో నీటిసమస్య తీర్చకపోతే మేమే సొంతడబ్బులతో సమస్య పరిష్కరించుకుంటామని తెలిపారు. దీనిపై సర్పంచ్ కుమారుడు మట్లాడుతూ సమస్యను అందరం కలిసి రోజుల వ్యవధిలో పరిష్కరించుకుందామన్నారు.

డీలర్ల సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు

లక్కవరపుకోట: నియోజకవర్గంలోని రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి డీలర్ల అసోషియేషన్ వినతిపత్రం అందజేశారు. బుధవారం 5 మండలాల డీలర్లు ఎమ్మెల్యే ఇంటివద్ద లలితకుమారిని కలిసి సమస్యలను విన్నవించారు. ప్రభుత్వం డీలర్ల సమస్యలపై స్పందించాలని, నేరుగా డీలర్ల ఖాతాలకు కమిషన్లు వేయాలని కోరారు. ఈ నెల నుంచి పంచదార ఇస్తున్నారని, అన్ని కార్డుదారులకు అందేలా చూడాలని కోరారు. డీలర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానని ఆమె హామీ ఇచ్చారు.

గురుకులం నిర్వహణపై కోఆర్డినేటర్ ఆరా

రేగిడి: మండలంలో ఉంగరాడమెట్ట గురుకుళ పాఠశాల/కళాశాల నిర్వహణపై గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ టీఎం ఫ్లోరెన్స్ బుధవారం స్థానిక పాఠశాలను సందర్శించి ఆరాతీశారు. తరగతులకు వెళ్లి విద్యాప్రమాణాలతో పాటు, పాఠశాల బాత్‌రూమ్‌లు, కిచెన్‌షెడ్, వంట నిర్వహణను ఆమె పరిశీలించారు. ప్రిన్స్‌పాల్ శ్రీనివాసరావు మాట్లాడారు. వైస్ ప్రిన్స్‌పాల్, అధ్యాపకసిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే బాధ్యత క్వారీ యజమానులదే

- జిల్లా రెవెన్యూ అధికారి అనిత



మాట్లాడుతున్న డీఆర్వో అనిత

వేపాడ: ప్రజాభిప్రాయసేకరణ సదస్సుల్లో ప్రజలు వ్యక్తం చేసిన సమస్యలను పరిష్కరించే బాధ్యత క్వారీ యజమానులపై ఉందని, ఈ దిశగా యజమానులు చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి అనిత సూచించారు. మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు పెదదుంగాడ పరిధిలోని సర్వే నెంబరు 7లో గల మెట్టపై ఏర్పాటు చేయదలచిన క్వారీ నిర్వహణకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షణలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయసేకరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్వారీ ఏర్పాటుకు సంబంధించి ప్రజల అభిప్రాయసేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, ప్రజలు, గిరిజన నాయకులు మాట్లాడుతూ ప్రజలకు కనీస అవసరాలైన తాగునీరు, రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టడంతో పాటు కాలుష్య నివారణకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఆర్‌వో మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారించాలని, ఆ దిశగా రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ విషయమై ఆమె మాట్లాడుతూ స్థానికులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందజేస్తే నిధులు మంజూరుకు కలెక్టర్ చర్యలు చేపడతారన్నారు. వీలుపర్తి గ్రామ పెద్దలు శానాపతి అప్పారావు, గోకాడ అచ్చెంనాయుడు, నాగభూషణం, గిరిజన నాయకులు కొప్పల అప్పారావు, ఉగ్గిన ఈశ్వరరావు, వార్డు సభ్యుడు వెంకటరమణ, మాజీ ఎంపీటీసి యేడువాక జోగారావు, మాజీ సర్పంచ్ గోకాడ సత్యంనాయుడు, కొటాన అర్జునరావు, తహసీల్దార్ సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొనగా వల్లంపూడి ఎస్ఐ కే.రాజేష్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

పైడిమాంబ హుండీ లెక్కింపు

విజయనగరం రూరల్: పైడిమాంబ హుండీ లెక్కింపు కార్యక్రమం శివాలయంవీధిలోని కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. నగదురూపేణా రూ. 10 లక్షల 56 వేల 233, బంగారం 13 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 98 గ్రాములు వచ్చినట్టు అధికారులు తెలిపారు. అన్నదాన హుండీ తెరవగా, 9,419 రూపాయలు, అమెరికా డాలర్, మలేషియా 50 రిగ్గిట్, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ 10 దీరమ్స్ విదేశీ నోట్లు ఉన్నాయి. వనంగుడి హుండీలు తెరవగా 95 రోజులకుగాను, రూ.7 లక్షల 53 వేల 247 నగదు, 2.80 మిల్లీగ్రాముల బంగారం, 258 వెండి వచ్చాయి. పర్యవేక్షణ నిమిత్తం రామతీర్థం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, శ్రీవారి సేవకులు, దేవదాయశాఖ సిబ్బంది హాజరయ్యారు.

నేడు ఎస్.కోటకు ఎంపీ శ్రీభరత్ రాక

శృంగవరపుకోట: తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ విద్యాసంకల్పం ద్వారా శృంగవరపుకోట పట్టణంలో శిక్షణ పొందిన టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులకు సంబంధించిన ధృవపత్రాలు అందించేందుకు గురువారం విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్ రానున్నారు. శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి హాజరుకానున్నారని ఈ విద్యాసంకల్పం నిర్వాహకులు తెలిపారు.

లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన

శృంగవరపుకోట: శృంగవరపుకోట స్త్రీశిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో బుధవారం పనిప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు కార్యకర్తలు పాటుపడాలని ఐసీడీఎస్ పీవో ఉమ సూచించారు. ఎంపీడీవో శేషుబాబు, ఈవోపీఆర్డీ ఐ.వి లక్ష్మి తదితరులున్నారు.

నేడు రామస్వామిపేటలో గ్రామ సందర్శన

వేపాడ: మండలంలోని రామస్వామిపేటలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా పాల్గొనాలని కోరారు.

వీధి కుక్కలను నివారించండి

శృంగవరపుకోట: వీధి కుక్కలను నివారించాలని శృంగవరపుకోట పంచాయతీ కార్యనిర్వాహక అధికారి వీవీ లక్ష్మికి బుధవారం జనసేన నాయకులు వినతిపత్రం అందించారు. బర్మాకాలనీ, పుణ్యగిరి రోడ్డు, జగనన్న కాలనీ తదితర ప్రాంతాల్లో వీధికుక్కల తాకిడి ఎక్కువగా ఉందన్నారు. నాయకులు సురేష్‌రాజు, తాండ్రింగి చంటి, మోపాడ చిన్ని కృష్ణ వున్నారు.

ఉచిత వైద్య శిబిరం

లక్కవరపుకోట: మండల కేంద్రమైన ఎల్.కోటలో గల ఓ పాఠశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గాయత్రి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు వి.అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో మురళీకృష్ణమోహన్, రామ్మోహన్‌రావు, అంజిబాబు విద్యార్థులకు, గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేశారు.

'ఇన్‌స్పైర్ మనక్' పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్: ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 200 పాఠశాలల నుంచి 850 ప్రాజెక్టులు నమోదయ్యాయని, ఈ ప్రాజెక్టుల నమోదుకు ఈనెల 15 వరకూ గడువు ఉందని, ఉపాధ్యాయులు త్వరపడాలన్నా రు. జిల్లా సైన్సు అధికారి కృష్ణారావు, డైట్ ప్రిన్సిపాల్ ఎస్‌టీ నాయుడు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కొత్తవలస: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చునని వియ్యంపేట ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమణమ్మ అన్నారు. బుధవారం మండలంలోని ఎమ్మికాపల్లి గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేస్తూ గర్భిణులు, బాలింతలు మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు.

భవిత కేంద్రాల సందర్శన

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రాలను బుధవారం బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు సందర్శించి, అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిత కేంద్రాల్లో దివ్యాంగ బాలలతో సిబ్బంది స్నేహపూర్వకంగా సేవలు అందించాలన్నారు. గణాంక అధికారి సూర్యారావు, ఎంఈవో పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు సొంత భవనం కల్పించాలి

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ, బుధవారం కోట వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు సొంత భవనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు వెంకటేష్, చినబాబు, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు సమకూర్చిన 200 మట్టి వినాయక విగ్రహాలను కార్యాలయం సిబ్బందికి, మేనేజరు, పంచాయతీ కార్యదర్శలకు బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు.

బొబ్బిలి రూరల్: గొల్లపల్లి వేణుగోపాలస్వామి హైస్కూల్‌లో ఎంఈవో గొట్టాపు వాసు చేతులమీదుగా బుధవారం విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం.. అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వనమిత్ర కృష్ణదాసు, సీఆర్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈఐసీతో పిల్లలకు చక్కని భవిష్యత్తు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహన్‌రావు



డీఈఐసీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జగన్మోహన్‌రావు

బెలగాం: జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం(డీఈఐసీ) ద్వారా పిల్లలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తు ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహన్‌రావు అన్నారు. స్థానికంగా ఉన్న జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని ఆయన ఆర్బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి పీఎల్.రఘుకుమార్‌తో బుధవారం సందర్శించారు. ప్రతి నెలా డీఈఐసీ కేంద్రంలో ఎదుగుదల లోపం, వైకల్యం, తదితర సమస్యలతో నమోదు అవుతున్న పిల్లల వివరాలు, వారికి అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు అవసరమైన బాలలకు డీఈఐసీ సెంటర్ ద్వారా ఉన్నత ఆసుపత్రిల్లో ఆపరేషన్లు చేయించి వారి లోపాన్ని సవరిస్తారని తెలిపారు. పుట్టిన వెంటనే పిల్లల్లో ఏమైనా లోపాలు ఉంటే గమనించి డీఈఐసీ ద్వారా చికిత్స అందించి సవరణ చేస్తారని చెప్పారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ వహించాలి



డిప్యూటీ డీఈవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

పాలకొండ: స్థానిక భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలుగల పిల్లలపై ప్రభుత్వం శ్రద్ధ వహించాలని వారి తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు బుధవారం పాలకొండ డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం స్పీచ్ థెరపీ, బీహేవియర్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ సేవలందించాలని కోరారు. ప్రత్యేక అవసరాలుగల చిన్నారుల సౌకర్యాల కోసం గతంలో అనేకమంది ప్రజా ప్రతినిధులను కలిశామని, అయినా ప్రయోజనం లేకుండాపోయిందని తెలిపారు. తమ అభ్యర్థనను ఉన్నతాధికారులకు అందించి, చిన్నారులకు సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. దీనిపై డిప్యూటీ డీఈవో స్పందిస్తూ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

డంపింగ్‌యార్డు వద్దు



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాలకొండ: సింగన్నవ లస వద్ద డంపింగ్‌యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆ పంచాయతీ ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సింగ న్నవలస, పరశురాంపురం, మల్లమ్మగూడ ప్రజలు మాట్లా డుతూ డంపింగ్‌యార్డు ఏర్పాటుకు నిర్ణయించిన స్థలం వద్ద రెండు ప్రధాన కాలువలు ప్రవహిస్తున్నాయ న్నారు. ఆ కాలువల ఆధారంగా తాము పంటలు పండిస్తున్నామన్నారు. ఇక్కడ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే నీరు కలుషితమై పంటలు పోవడమే కాకుండా, ప్రజలు అనారోగ్యం బారిన పడతారని వివరించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి



సభ్యత్వ పత్రాలు చూపిస్తున్న పావని

బెలగాం: రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని అన్నారు. బుధవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కువ సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీ అని అన్నారు. గతంలో 2018లో 18 వేల మంది సభ్యత్వం తీసుకుని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా బీజేపీ ఎదిగింది. ఈ సారి గతం కంటే ఎక్కువగా సభ్యత్వ నమోదు చేయించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు 200 మందిని చేయిస్తే వారికి క్రియాశీల సభ్యత్వం ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజించండి



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న సీఐ

సాలూరు: గణపతి ఉత్సవాలను నిర్వహించేవారు మట్టి విగ్రహాలనే పూజించాలని పట్టణ సీఐ అప్పలనా యుడు సూచించారు. బుధవారం ఆయన సాలూరులో గణపతి మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించా రు. ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్ప వన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థలు అందజేసిన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

గుణుపురంలో కలెక్టర్ పర్యటన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

ఒడిశా

రాయగడ: గుణుపురం సబ్ డివిజన్‌లో కలెక్టర్ పారుల్ పట్వార్ బుధవారం పర్యటించారు. పలు కార్యాల యాలను సందర్శించి, అభివృ ద్ధి పనులపై సమీక్షలు నిర్వ హించారు. సమగ్ర గిరిజనా భివృద్ధి కార్యాలయానికి వెళ్లి అన్ని అభివృద్ధి పనుల రికార్డులను పరిశీలించారు. పలు గ్రామాల్లో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. సుబద్రా యోజన పథకాన్ని అందరూ వినియో గించుకోవాలని మహిళలకు సూచించారు. వివిధ పాఠశాలలను సందర్శించారు. ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే క్రమశిక్షణ ముఖ్యమని విద్యార్థు లకు సూచించారు. కలెక్టర్ వెంట వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జనసేవా కేంద్రాలకు క్యూకట్టిన మహిళలు



జనసేవా కేంద్రంలో మహిళలు

రాయగడ: సార్వత్రిక ఎన్నికల ముందు బీజేపీ తాము అధికారంలోకి వస్తే ప్రతి మహిళా ఖాతాలో రూ.50వేలు నగదు జమచేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆ మేరకు ఈనెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం మొదలవుతుందని అధికారుల ప్రకటించారు. ఈలోగా అర్హులయిన మహిళలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గానీ ఆన్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు ఆధార్‌తో ఫోను నెంబరు, బ్యాంకు ఖాతానెంబరు అనుసంధానం అయి ఉండాలని తెలపడంతో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు మహిళలు వందల సంఖ్యలో జనసేవా కేంద్రాలకు చేరుకుంటున్నారు. దీంతో అన్ని అంగనవాడీ కేంద్రాలు, జనసేవా కేంద్రాల్లో రద్దీ ఏర్పడింది.

ఎన్నాళ్లిలా?

● అధ్వానంగా పార్వతీపురం-పాలకొండ రహదారి ● అడుగడుగునా గుంతలు
● శిథిలావస్థలో ప్రధాన కాల్వర్టు ● పొంచిఉన్న ప్రమాదం



గుంతలమయంగా ప్రధాన రహదారి



శిథిలావస్థలో ప్రధాన కల్వర్టు

గరుగుబిల్లి: మండలంలో పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి అత్యంత దారుణంగా తయారయ్యింది. ప్రస్తుతం వర్షాల కారణంగా మరింత అధ్వానంగా.. ప్రమాద కరంగా మారింది. పార్వతీపురం నుంచి గరుగుబి ల్లి మండలం సంతోషపురం వరకు అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. ఈ రహదారిపై వాహనదారులు నిత్యం అవస్థలు పడాల్సి వస్తోంది. ఎన్నాళ్లీ రహదారి కష్టాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉల్లిభద్ర ప్రాంతంలో తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కాలువపై నిర్మించిన ప్రధాన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. గత కొద్ది రోజుల కిందట కురిసిన వర్షాలకు ఒకవైపు గండి పడింది. గండిని పాక్షికంగా పూడ్చి పెట్టారు. కల్వర్టుపై వర్షపు నీరు నిల్వ ఉండడంతోపాటు కల్వర్టుకు చెందిన ఇనుప చువ్వలు బయటకు దర్శనమిస్తున్నాయి. ప్రధాన కల్వర్టుకు ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం భారీ వాహనాల రాకపోకలు ఈ మార్గంలోనే సాగిస్తున్నాయి. ఏ నిమిషంలో కూలుతుందోనన్న భయాందోళనలో ఉన్నారు.

భారీ వాహనాల రాకపోకలు

ప్రధానంగా బొబ్బిలి సమీపంలోని పారాది వంతెన బలహీనంగా ఉండటంతో పరిమితికి మించిన భారీ వాహనాలు నిత్యం ఈ మార్గంలో ప్రయాణం చేస్తున్నాయి. దీంతో ప్రధాన రహదారి, కల్వర్టు బలహీనంగా తయార య్యాయి. వర్షాలకు ప్రధాన రహదారిపై గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడుతన్నారు. చీకటి పడిందంటే ఈ మార్గంలో ప్రయాణానికి వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధు లు స్పందించి రహదారిని బాగు చేయించాలని, కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఆస్పత్రి భవనాలను పూర్తిచేయాలి



నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

సాలూరు: నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాలను త్వరిత గతిన పూర్తి చేయాలని సీపీఎం నాయకులు ఎం.శ్రీనివాస్, కె.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్ర మం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మామిడిపల్లి, తోణాం గ్రామాల్లో నిర్మాణదశలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణాలను త్వరితగతి న పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని పరీక్షలు అందుబాటులోకి తేవాలని కోరారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకు రాలు సూర్యకుమారికి వినతిపత్రం అందజేశారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించండి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించా లని సీపీఐ జిల్లా కార్యవ ర్గ సభ్యులు గురుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎస్‌బీఐ సెంటర్ వద్ద ఆందోళన చేపట్టారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి, అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఆహారభద్రతా చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఈ ఆందోళనలో జిల్లా సంస్థ సభ్యులు ప్రసాద్, పత్తిక మోహన్‌రావు, మండంగి సింగన్న, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం

సీతంపేట: కొత్తూరు మండలం అడ్డంగి పంచాయతీ బొండూరు గ్రామానికి చెందిన సవర నిఖిల్ అనే బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం ఐటీడీఏ తరపున పీవో వీవీ రమణ రూ.13వేలు అందజేశారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాల యంలో బాలుడి తల్లిదండ్రులకు ఈ మొత్తాన్ని అందించారు. ఆ బాలుడు కాళ్ల వంకర వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సెక్షన్ అసిస్టెంట్ మనోజ్ తదితరులు ఉన్నారు.

ఐటీడీఏ నర్సరీ పరిశీలన

సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తురాయిపువలస ఉద్యానవనాల నర్సరీని పీవో వీవీ రమణ బుధవారం సందర్శించారు. నర్సరీలో ఉండే మొక్కలను పరిశీలించారు. ఏకో టూరిజం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి



ఆహార పదార్థాలను రుచి చూస్తున్న ఎంఈవో నాగభూషణరావు

గరుగుబిల్లి: మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పక్కాగా పాటిం చాలని ఎంఈవో ఎస్.నాగభూషణ రావు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. ఆహార పదార్థాలను రుచికరంగా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ఎల్ పాత్రుడు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి రుణాలు



మాట్లాడుతున్న ఏపీఎం అప్పలనాయుడు

గరుగుబిల్లి: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికం గా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్త్రీ నిధి రుణాలతో పాటు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేస్తోందని మండల వెలుగు ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామైక్య సంఘంలో క్లస్టర్ కోఆర్డినేటర్ సీహెచ్ తిరుపతిరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావే శం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్త్రీనిధి రుణాలు రూ.50వేలు మేర మంజూరు చేసేవారని, ప్రస్తుతం లక్ష రూపాయలు వరకు రుణం మంజూరు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో క్లస్టర్ కోఆర్డినేటర్ తిరుపతిరావు, వీవోఏ ఇ.గౌరి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయండి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని గుమ్మలక్ష్మీపురం లోని ఆమె స్వగృహంలో సీపీఐ నాయకులు బుధవారం కలిశారు. ఇళ్లులేని గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించాలని, తాగునీటి వసతి కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా నాయకుడు జీవన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

బాధితులకు పరామర్శ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన మత్తి నగేష్ చిన్న కుమారుడు మత్తి మానవ్ ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నగేష్‌ను, కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. చిన్న వయస్సులోనే మానవ్ మృతి బాధాకరమని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పోలూరు శ్రీనివాసరావు, తాడంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ సీఎంవోగా సన్యాసినాయుడు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏలో కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి (సీఎంవో)గా కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి భర్త అడ్డాకుల సన్యాసినా యుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సన్యాసినాయుడు గుమ్మలక్ష్మీపురం మం డలం కేదారిపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఐటీడీఏ ఉన్నతాధికారులు సన్యాసినాయుడు ను ఐటీడీఏ విద్యా విభాగంలో సీఎంవోగా నియమించారు. ఈసందర్భగా సన్యాసినా యుడు మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జీపీ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.4.39 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పాలకొండ: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవ మైన కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయ హుండీలను బుధవా రం తెరిచి లెక్కించారు. జిల్లా దేవదాయశాఖ సహాయకురాలు వై.ఇందిర పర్యవేక్షణలో ఆలయ ఈవో బి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో లెక్కించారు. ఆగస్టు 3 నుంచి సెప్టెంబరు 4 వరకు నగదు రూపంలో రూ.4 లక్షల 39వేల 523 ఆదాయం వచ్చినట్టు ఈవో తెలిపారు. ఒక విదేశీ కాయిన్ లెక్కింపులో వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ, ఏఎస్ఐ ధర్మారావు, విశాఖ గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసశర్మ, అకౌంటెంట్ లత పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



బోల్తా పడిన లగేజ్ ఆటో

భామిని: కొరమ గ్రామ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలో ఓ లగేజీ ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం ఉదయం కొత్తూరు వెళుతున్న లగేజీ వాహనం కొరమ గ్రామం దాటాక రోడ్డుపై గుంతలో దిగడంతో బోల్తాపడింది. అటుగా వెళ్తున్న వాహనదారులు ఆ వాహనాన్ని పైకిలేపి, సరిచేసి పంపించారు.

రైతులకు ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్: మండలంలోని పెద్దూరు పంచాయతీలో బుధవారం గిరిజన రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ ఆదిలక్ష్మి, ఐటీడీఏ కోఆర్డినేటర్ పవన్, హెచ్.ప్రసాద్ చేతులమీదుగా డీఏపీ ఎరువును అందజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

క్లుప్తంగా..

10న బహిరంగ వేలం

పాలకొండ: పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఉన్న నిరుపయోగమైన ఇనుప సామాన్లు, కలప, ప్లాస్టిక్ సామాన్లకు ఈనెల 10న మంగళవారం బహిరంగ వేలం వేయనున్నట్టు ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు తెలిపా రు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడు దల చేశారు. ఆసుపత్రి కండామినేషన్ కమిటీ ఆధ్వర్యం లో వేలం ఉంటుందన్నారు. 10న ఉదయం 11 గంటలకు వేలం పాట ఉంటుందని చెప్పారు.

హెచ్‌ఎం మృతి

పార్వతీపురం రూరల్: మండలంలోని బొడ్డవలస పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఈదిబిల్లి నీలకంఠ స్వామి(49) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వగ్రామం లక్ష్మీనారాయణపురంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

సీతానగరం: ఆయుర్వేద వైద్యంతో సీజనల్ వ్యాధులకు చక్కని ఉపశమనం ఉంటుందని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి టి.హేమాక్షి అన్నారు. బుధవారం కె.వెంకటాపురం గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆమె రోగుల కు తనిఖీలు చేసి, మందులు అందజేశారు. 60 మందికి పైగా వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. ఆయూష్ సిబ్బంది పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్‌పై అధికార యంత్రాంగం అప్రమత్తం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో మరో అల్ప పీడనం కారణంగా గురువారం నుంచి 7వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేయడంతో పాటు వీఆర్వోలను అప్రమత్తం చేశామని ఇన్‌చార్జి తహసీల్దార్ పి.సత్యలక్ష్మీకుమార్ బుధవారం తెలిపారు. ముఖ్యంగా తోటపల్లి ప్రాజెక్టు వద్ద వీఆర్వోలు అప్రమత్తంగా ఉంటూ నీటి ప్రవాహం వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించామన్నారు.

స్వచ్ఛందంగా పూడికతీత

మక్కువ: మండలంలోని వెంగళరాయ సాగర్ కాలువ లో బుధవారం సుమారు వందమంది రైతులు స్వచ్ఛం దంగా పూడికతీత పనులు చేపట్టారు. కన్నం పేట, కొండరేజేరు, బక్కుపేట, బల్లకృష్ణాపురం రైతులు శ్రమదానంతో కాలువలో పూడికలు తీశారు. ఖరీఫ్ సీజన్ కుగాను వెంగళరా యసాగర్ నుంచి కుడి, ఎడమ ప్రధా న కాలువల ద్వారా నీరు విడిచిపెట్టినప్పటికీ తమ పొలా లకు సాగునీరు అందడంలేదని వారు వాపోయారు.



పూడికలు తీస్తున్న రైతులు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● ఘనంగా పోషణ అభియాన్ వేడుకలు



భామిని: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో శాంతిభవానీ



సాలూరు రూరల్: సూపర్‌వైజర్ లక్ష్మికి బొకే అందిస్తున్న అంగన్‌వాడీలు

భామిని: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని ఐసీడీఎస్ పీవో శాంతిభవానీ సూచించా రు. పోషణ అభియాన్ ఉత్సవాల్లో భాగంగా ఆమె బుధవారం భామిని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, దీనిపై మహిళలే దృష్టి సారించాలని సూచించారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి విశ్వేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, చిన్నారులు, బాలింతలు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: సాలూరు మండలంలో పోషణ అభియాన్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సోంపిగాం, కందులపథం, గంగన్నదొరవలస, శివరాంపురం, జీగిరాం, బాగువలస తదితర గ్రామాల్లో ఈ వేడుకలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, విజయలక్ష్మి, అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు బడ్నాన శశికళ పాల్గొన్నారు.